# దూరపు దగ్గర

అతను సెల్‌లో నెంబరు చూసుకుంటోంటే, "నేను" అన్నాను. అతను నాకు కనిపిస్తున్నాడు. నేను అతనికి కనిపించను. నాకు రెండు సెల్స్ ఉన్నాయి. అతనికి ఫోన్ చేసే సెల్ అతనితో మాట్లాడవలసి వస్తే తప్ప మిగతా సమయాల్లో ఆపేసే ఉంచుతాను. ఇది అతను ఇవ్వకపోయినా అతనిదే అనుకుంటాను. అతనికి నేనే ఫోను చేస్తుంటాను. అదీ ఇంట్లో ఉన్నప్పుడే, అతన్ని చూస్తూ రాత్రుళ్ళే. రెండో సెల్ మా ఆఫీసు వాళ్ళు ఇచ్చింది. దాన్నుంచి అతనితో ఎప్పుడూ మాట్లాడలేదు.

అతని పేరు రఘు. నలభయి సంవత్సరాల వయసు ఉంటుంది. చామనచాయలో ఆకర్షణీయంగా ఉంటాడు. ఎందుకో తెలియదు కాని అతనితో సాన్నిహిత్యంగా ఉండాలనిపిస్తోంది. మగాళ్ళంటే మునుపంత నమ్మకం నాకు ఇప్పుడు లేదు. బాగా తగ్గింది. ఆచి తూచి అడుగులు వేస్తున్నాను. పడి లేవడాల్లో విసుగెత్తి పోయి ఉన్నాను. రఘుతో నాకు ఫోనులోనే పరిచయం. మొట్టమొదటి సారిగా ఏప్రిల్ ఇరవయి ఏడున నేనే అతనితో మాట్లాడాను. ఆరోజు నా పుట్టినరోజు. ఆ విషయం అతనికి చెప్పలేదు. ఇప్పటికి ఆరునెలలనుండి క్రమం తప్పకుండా మాట్లాడుతున్నాను. అతనంటే ఇష్టం ఉండడం వలన అనుకుంటాను, నాకు అతని మాటలు బావుంటాయి. ఏమయినా చెబుతోంటే ఎంత సేపయినా వినాలనిపిస్తుం టుంది.

తలెత్తి గోడ గడియారం వంక చూశాను. పన్నెండూ పది అయింది. రఘుతో మాట్లాడడానికి అప్పటినుండే నాకు వీలుగా ఉంటుంది. తెరచి ఉన్న కిటికీలోంచి అతను పడుకున్న మంచం కనిపిస్తోంది. ఒంటిమీద తెల్ల లుంగీ మటుకు ఉంది. చొక్కా వేసుకోలేదు. ఛాతిమీద నల్లటి వెంట్రుకలు వత్తుగా

ఉన్నాయి. మెడలో లావుపాటి బంగారపు గొలుసు ఉంది. అతనికి తెలుపంటే ఇష్టమనుకుంటాను. దుప్పట్లు దిండుగలేబులు, తలుపు కర్టన్లు అన్నీ తెలుపుగా ఉన్నాయి.

"మీ ఫోనుకోసమే, ఎదురు చూస్తున్నాను. నిజం" అన్నాడు.

"ఎందుకనో?" అడిగాను.

నేను అతనంత మాటకారిని కాదు.

"అలవాటయి పోవడం వలనేమో"

"టి.వి.లో ఏదో సినిమా వస్తోంటే మా అమ్మగారు పదినిమిషాల కిందటి వరకు చూసి నిద్రపోడానికి పడక గదిలోకి అలా వెళ్ళారు. మీతో ఇలా మాట్లాడుతున్నాను".

మా ఇంట్లో వాళ్ళు ఎవరయినా మెలకువగా ఉంటే రఘుతో మాట్లాడడానికి నాకు ఏమాత్రం వీలుండదు. వారంలో నాన్న ఒకటీ రెండు రోజులకన్నా ఇంటికి ఎక్కువగా రాడు. మేడ్చల్‌లో సివిల్ కాంట్రాక్టు పనులుచేయిస్తున్నానంటాడు. తను లేకపోతే ఎక్కడ పనులు అక్కడ ఆగిపోతాయని అంటాడు. నా మటుకు నాకు నిజం కాదనిపిస్తుంది. నాకు ఒక విషయం తెలుసు. ఎక్కువ రోజులు మల్కాజ్‌గిరిలో ఉంటుంటాడు. ఎప్పుడో కాని ఇంటికి కావలసినవి తెచ్చిపెట్టడు. మిగతా ఏ విషయాలు పట్టించుకోడు. ఇంట్లో ఉన్నా పరాయి వ్యక్తిలా మెలుగుతుంటాడు. అమ్మతో అన్యోన్యంగా ఉండడం నేనెప్పుడూ గమనించలేదు. ఏదో ఎక్కడో పొరపాటు జరుగుతోంది. సమస్య ఏమిటో ఇన్నేళ్ళు వచ్చినా నాకు అర్థం కాలేదు. నాలుగయిదు సార్లు అమ్మను అడిగాను. సరయిన జవాబు ఏమీ రాలేదు. ఇంట్లో నాన్నకు ఏం కావాలన్నా అమ్మను అడగడు. 'బుజ్జమ్మా' అని నన్నే అడుగుతుంటాడు. ఇంట్లో నన్ను 'బుజ్జీ' అని పిలుస్తుంటారు. నాన్న ఇంట్లో ఉన్నా పదికాకముందే నిద్రపోతాడు. ఉదయం నేను నిద్రలేచేసరికి వెళ్ళిపోయి ఉంటాడు. సెంటర్ టేబిలు మీద కప్పులో పెట్టిన టీ అలానే ఉంటుంది. నాన్న నామీద ఏ కొద్దిపాటి శ్రద్ధ తీసుకున్నా నా పెళ్ళి ఎప్పుడో అయి ఉండేది.

రఘుకు నాలా నిద్రంటే చుక్కెదురేమో చాలా సేపటివరకు మెలకువగానే ఉంటాడు. అతనికి చీకటంటే భయమేమో లయిటు వేసుకునే నిద్రపోతాడు. నాకు

ఏమాత్రం వెలుగు ఉన్నా నిద్రపట్టదు. అందరి మధ్య ఉన్నప్పుడు సమయం తెలియకుండా గడిచిపోతుంది. ఏకాంతంగా ఉన్నప్పుడు మనసు ప్రశాంతంగా ఉండదు. కలత. తొందర. ఎందుకో తెలియదు. అతనికీ ప్రశాంతత దూరంగా ఉంటుందేమో, సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తూ పడక గదిలో పచార్లు చేస్తుంటాడు. ఏ కలతలు లేనివాళ్ళు ఆనందంగా సిగరెట్లు కాల్చడం నాకు తెలుసు. ఒకసారి మాటల్లో అతను 'నా బాధలు మీకేం తెలుసు?' అని నాతో ఉన్నప్పుడు, 'మీ బాధ లేమిటి?' అని అడుగుదామనిపించింది. మాట నా పెదాల చివరంటా వచ్చింది. అడగలేదు. ఎవరయినా తన విషయాలు చెబితే వింటాను. నా అంతట నేను అడగను.

నాలుగయిదుసార్లు "మీరు మాట్లాడుతోంటే నామనసు తేలికయి ఎంతో ఆనందంగా ఉంటుంది" అన్నాడు. నిజానికి నాకూ అలానే అనిపిస్తుంది. ఈ మాట అతనితో అనలేదు.

నా వయసు ముప్పయి ఎనిమిది సంవత్సరాలు. అలా కనబడను. ఎవరడిగినా ఆరేడు సంవత్సరాలు తక్కువ చేసి చెబుతాను. నాతో చదువుకున్న వాళ్లు ఎప్పుడో పెళ్లిళ్లు చేసుకుని పిల్లల్ని కని చక్కటి జీవితాలు గడుపుతున్నారు. మా బేచ్‌లో మిగిలిపోయింది నేనేనేమో! నాతో చదువుకున్న వాళ్ళు ఎవరయినా, ఎప్పుడయినా తారసపడితే తల పక్కకు తిప్పుకుని ఎటో చూస్తూ వెళ్ళిపోతుంటాను. ఏదో సాధిద్దామనే ఉద్దేశంతో ఎం.ఎ (సోషల్‌వర్క్) మొదటి తరగతిలో పాసయి ఒకటి రెండు కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిచేశాను. హంగులు ఎన్నో ఉన్నా మంచిజీతాలు ఇచ్చేవాళ్లు కాదు. సెడ్విన్ ఆస్పత్రిలో పనిచేస్తుండగా శేఖర్‌తో పరిచయం అయింది. అతని కంఠస్వరం ఆడమనిషిదిలా ఉంటుంది. అతనంటే ఇష్టపడ్డాను. పెళ్ళి చేసుకుందామని కూడా అనుకున్నాను. ఆ ఉద్దేశంతోనే మా పరిచయాన్ని చాలా దూరం తీసుకువెళ్లనిచ్చాను. మెల్లగా నాకు స్పష్టమయిందేమిటంటే అతనికి నన్ను పెళ్ళి చేసుకోవడం ఇష్టమయినా అతని అన్నయ్య అడ్డు పడతాడని భయమట. తలిదండ్రులు చిన్నప్పుడే చనిపోతే అన్నయ్యే పెంచిపెద్దచేసి చదువు చెప్పించి నిలబెట్టాడట. నిజమే అయి ఉంటుంది. శేఖర్ అన్నయ్య సంతోష్‌నగర్‌లో ఉంటున్నాడు. చాలాసార్లు ఆయన దగ్గరకు వెళ్ళి మా గురించి చెప్పకుందామనిపించింది. ధైర్యం చాలలేదు. అదే శేఖర్‌ను కూడా ఆపి ఉండొచ్చు. అలా అని నన్ను వదులుకోడానికి ఇష్టపడడం లేదు. ప్రస్తుతం

బిలాస్‌పూర్ కార్పొరేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. రోజూ మాట్లాడుకుంటుంటాం. నెట్‌లో చాట్‌చేసుకుంటుంటాం. రెండు మూడు నెలల కొకసారి వచ్చి వెళ్తుంటాడు. తనింకా పెళ్ళి చేసుకోలేదని అంటుంటాడు. అయితే అతను నాతో మునుపటిలా నిజం చెబుతున్నట్లు అనిపించడం లేదు.

రెండు సంవత్సరాల కిందటి మణిపాల్ యూనివర్శిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో ఎం.బి.ఎ. (హెచ్.ఆర్) పూర్తి చేసి ఒక ప్రభుత్వేతర సంస్థలో తప్పనిసరయి ఉద్యోగంలో చేరాను. అంతకుముందు అదే సంస్థలో అయిదు సంవత్సరాలు పనిచేసి మా బాస్ ప్రవర్తన నచ్చక మానేసిన నేను తిరిగి అతని దగ్గరే చేరాను. మా బాస్‌కు నా వయసు ఉంటుంది. పి.జి. ఇద్దరం కలిసి చదువుకున్నాం. పెళ్ళి కాలేదు. ప్రభుత్వేతర సంస్థ అతనికి బాగా కలిసి వచ్చింది. బాగానే సంపాదించాడు. మూడు అపార్ట్‌మెంట్లు కొన్నాడు. రెండు అద్దెకు ఇచ్చి ఒకటి తనుంచుకున్నాడు. దానికి నేను చాలాసార్లు వెళ్ళాను. అన్ని సదుపాయాలున్నా బోసిగా ఉన్నట్టు అనిపిస్తుంది. ఆ సంస్థలో ఎవరికీ ఇవ్వనంత జీతం నాకు ఇస్తుంటాడు. తనకు ఇష్టమయినప్పుడు నన్ను లాంగ్ డ్రయివ్‌కు తీసుకువెళ్తుంటాడు. అప్పుడప్పుడు నాకూ అవసరం అనిపిస్తుంది. ఆఫీసులో ఎంత మామూలుగా ఉన్నా ఆ చనువు కనబడుతూ ఉండడం వలనో ఏమో మిగతా వాళ్ళెవరూ నాకు దగ్గరగా మెలగరు. నాలోనేను మాట్లాడుకోడానికి అలవాటు పడి పోతానేమోనని భయంగా ఉంటుంది.

ఇప్పటి ఉద్యోగంలో చేరకముందు నాకు బాగా దగ్గరయిన వ్యక్తి చిన్నారావు. అతని వయసు యాభయి పయినే ఉంటుంది. అలా కనబడడు. ఏదో ఏజన్సీలో మంచి ఉద్యోగంలోనే ఉన్నాడు. ఎప్పుడూ ట్రిమ్‌గాఉండేవాడు. జాలీమనిషి. నవ్వుతూ చక్కగా మాట్లాడేవాడు. అతని భార్య చనిపోయి పన్నెండు సంవత్సరాలు దాటిఉంటాయి. అతని భార్య బతికి ఉన్నప్పటి నుండి నాకతను తెలుసు. ఒక కొడుకు. కాన్పూర్‌లోనో ఎక్కడో చదువుకుంటున్నాడు. భార్య చనిపోయాక చిన్నారావు ఎంచాతనో మళ్లీ పెళ్ళి చేసుకోలేదు. డబ్బున్నవాడే. పెద్ద ఇంట్లో ఒక్కడే ఉంటాడు. మునుపు ఫోనులో అతనితో రోజుకు అయిదు గంటలయినా మాట్లాడేదాన్ని. చాలాసార్లు అతనింటికి వెళ్ళాను. నాకు ఇష్టమయిన వంటలు చేసి పెట్టేవాడు. చాలా వస్తువులు, డ్రస్‌లు గిఫ్ట్‌గా ఇచ్చాడు. నేను అప్పుడప్పుడు వేసేకునే ముత్యాలదండ అతనిచ్చిందే.

ఆ తెల్లటిముత్యాలదండ అంటే నాకు చాలా ఇష్టం. శేఖర్ బిలాస్‌పూర్ నుండి ఎప్పుడు ఇక్కడకొచ్చినా ఆ దండే వేసుకు వెళ్తాను.

నాకన్నా పెద్ద వాడయినా చిన్నారావు మంచి స్నేహితుడు. ఏ సహాయానికయినా వెనకాడేవాడు కాదు. నాతో మనసు విప్పి మాట్లాడేవాడు. ఒకటే అయిష్టపడేవాడు. అబద్ధాలు మటుకు సహించేవాడు కాదు. అతని స్నేహం వదులుకోలేక అబద్ధాలు అడవలసి వస్తుండేది. అతని ఉద్దేశం ఏమిటో ఏమో ఎలా సంపాయించాడో నా గురించి చాలా సమాచారం సేకరించి ఒక రోజున నాముందు ఉంచేసరికి ఉక్కిరిబిక్కిరి అయ్యాను. ఏదీ అబద్ధం కాదు. నేను ఏం చెప్పినా ఇంకో అబద్ధం అవుతుంది. కోపం వచ్చింది. అప్పటికి ఏం మాట్లాడకుండా మరుసటి రోజు ఫోనుచేసి ఛండాలంగానే తిట్టాను. అతన్నితిరిగి మాట్లాడనీయకుండా ఫోను పెట్టేశాను. అతను మళ్ళీ నాకు ఫోను చేయలేదు. దూరమయ్యాం. నా గురించి అంత తెలుసుకున్నందుకు ఇప్పటికీ అతనంటే కోపం పోలేదు. అతను రోజుకొకసారయినా గుర్తు వస్తాడు. నా సంగతులు వేరే ఎవరి కయినా చెబుతాడని కాదు. అటువంటి పనులు చేయడు. అదీ అతను గుర్తువచ్చినప్పుడల్లా అతను చనిపోతే బావుండు అనుకుంటాను. అదీ మామూలుగా కాదు. ఘోరంగా చనిపోవాలి. అతని కళ్ళు కంటిఆస్పత్రికి, దేహం గాంధీ ఆస్పత్రికి రాసిచ్చాడు. ఏవీ ఎక్కడకు చేరకూడదు. రోజూ ఉదయాన్నే దినపత్రికల్లో ఆబిచ్యురీ కింద అతని ఫోటో ఉంటుందేమోనని కుతూహలంగా చూస్తాను. కనబడదు. నిరుత్సాహ పడతాను.

ఈడులో నా పెళ్ళి గురించి నేను పట్టించుకోలేదు. జీవితమంతా యవ్వనమే అనుకున్నాను. మంచి సంబంధాలు నా ముందు నుంచి వెళ్తోంటే అంతకన్నా మంచి సంబంధాలు వస్తాయనుకున్నాను. ఇప్పుడు 'అయ్యో' అనుకుని ఏం లాభం? మాలో ముప్పయి దాటాక మంచి సంబంధం దొరకడం కష్టం. ఇప్పుడు ఏ సంబంధం రావడంలేదు. మునుపటి స్నేహితులకు నేనంటే మొహమెత్తి పోయినట్లుంది. అందరూ ఉండి ఏకాకిని అయిపోతున్నానేమో. ఎవరితో మెలిగినా నేను నాలానే ఉండాలనుకుంటాను. వీలు కావడం లేదు. మనసు ఒక చోట ఉండదు. ఏకాగ్రత తగ్గే వయసు ఇంకా రాలేదు.

రఘుసెల్, నాసెల్ ఒకే కంపెనీది అవటాన ఎంతసేపయినా మాట్లాడుకోవచ్చు.

ఖర్చు ఉండదు. మా అపార్టుమెంటులో నా గదిలో ఉన్న టెలిస్కోపులో అతన్ని చూస్తూ మాట్లాడుతున్నాను. ఈ విషయం అతనికి తెలియదు. నేను చెప్పలేదు. అతను నా పేరు అడిగినప్పుడు అరుణ అని నిజమే చెప్పాను. వయసు ఎంత అని అడిగితే ఇరవయి అయిదు సంవత్సరాలని అన్నాను. ఎక్కడ నుండి మాట్లాడుతున్నారంటే విద్యానగర్ నుండి అన్నాను. నిజానికి మేం ఒకే టౌన్‌షిప్‌లోనే ఉంటున్నాం. మా టౌన్‌షిప్‌లో వృత్తాకారంలో పన్నెండు పది అంతస్తుల భవనాలున్నాయి. ఒక్కో భవనంలో వంద అపార్టుమెంట్లు ఉన్నాయి. భవనాల మధ్యలో పార్కులు, ఈత కొలనులు, ఆటస్థలాలు ఉన్నాయి. మా అపార్టుమెంటు పదో అంతస్థులో ఉండడం వలన చవగ్గానే వచ్చింది. మేం ఇక్కడకు వచ్చి రెండు సంవత్సరాలు దాటాయి.

మా ఇంట్లోని టెలిస్కోపు మా అన్నయ్యది. వాడు బి.ఇ.(సివిల్) చేసి పదిహేనేళ్ళవుతోంది. వాడు నా కంటే ఏడాదిపెద్ద. చదువు ముగించాక మూడు నాలుగు సంవత్సరాల పాటు ఉద్యోగంకోసం శ్రమపడ్డాడు. ఏదీ దొరకలేదు. కొన్నాళ్లపాటు రియల్‌ఎస్టేటు వ్యాపారంలో తిరిగాడు. నిలదొక్కుకోలేకపోయాడు. ఏదో సివిల్ కాంట్రాక్టులు చేశాడు. అచ్చిరాలేదు. ఇప్పుడేదో మెడికల్ ఎక్విప్‌మెంటు డీలర్‌షిప్ తీసుకున్నానని అంటాడు. నిజం కాదనిపిస్తుంది. ఉదయం పదకొండు దాటాక కాని నిద్రలేవడు. రాత్రి ఇంటికి చేరుకునేసరికి రెండున్నరామూడవుతుంటుంది. డబ్బులకు తడుముకుంటూ ఉంటాడనుకుంటాను. నా ఎ.టి.ఎం. కార్డు తీసుకెళ్ళి డబ్బులు తెచ్చుకుంటాడు. ఎక్కువగా స్నేహితులతో తిరుగుతుంటాడు. వాడికీ పెళ్ళికాలేదు. నాకు పెళ్ళి అయితేనే కాని తను పెళ్ళి చేసుకోడట. ఈ మాట విన్నప్పుడల్లా నాకు నవ్వొస్తుంటుంది.

మా అన్నకు అస్ట్రానమీ అంటే ఇష్టం. ఎంత రాత్రికి ఇంటికి తిరిగొచ్చినా కనీసం గంటసేపయినా టెలిస్కోపు వెనక కుర్చీ వేసుకునికూర్చుని నక్షత్రాలుచూడడం వాడికి అలవాటు. వాడు ఇంటికి ఆలస్యంగా రావడం ఒకవిధంగా నాకు మంచిదయింది. టెలిస్కోపు లోంచి రఘును చూస్తూ మాట్లాడే అవకాశం కలుగుతోంది. ఆకాశంలో ఏమేమి చూడాలో ఇప్పటికీ నాకు తెలియదు. నక్షత్రాలు రాలిపోవడం గమనిస్తున్నప్పుడు 'చిన్నారావూ, నువ్వెప్పుడు రాలిపోతావు?'అనుకుంటాను. ఏం, ఆ సాన్నిహిత్యం నాకు మరొకరి దగ్గరదొరకదా?

మా టౌన్‌షిప్‌లోనే ప్రపంచమంతా ఇమిడి ఉన్నట్టనిపిస్తుంది. ఇంటింటికి ఒక కథ. దుఃఖం, బాధ, సుఖం, ఆనందం, విచారం, ఓహ్. ఒక్కటేమిటి, అన్నీ కనబడుతూ ఉంటాయి. ఎందుచేతనో నా దృష్టి రఘు మీద నిలిచింది. ఎక్కువ శ్రమ పడకుండా కొరియరు కుర్రాడిద్వారా రఘు అపార్టుమెంటు, సెల్‌నెంబర్లు దొరికాయి. ముందు నేనే అతనికి ఫోనుచేశాను. బిడియం వలనేమో వారం వరకు అతను మనసు విప్పి మాట్లాడలేదు. చిన్నారావుతో కలిసిపోవడం వలనేమో ఎదుటివాళ్ళ మొహమాటం పోగొట్టడం నేర్చుకున్నాను.

పన్నెండూ పదికి మొదలయిన మా సంభాషణ లింకులా సాగిపోతోంది. రోజూ ఇంతే. నాకు అన్ని విషయాల్లో కొద్దో గొప్పో పరిచయం ఉంది. చిన్నారావు నన్ను పర్‌ఫెక్టుగా అర్థం చేసుకున్న వ్యక్తిలా నాకు అనిపిస్తూ ఉంటుంది. నేను అతన్ని తక్కువగా అంచనా వేశాను. నేను అబద్ధాలు చెప్పననేం కాదు. ఏ పొరపాటు చేయకుండా రఘుతో నా పేరు తప్ప ఏ నిజాలు చెప్పడం లేదు. అతని గురించి పూర్తిగా తెలుసుకున్నాకే నన్ను నేను బయట పెట్టుకుంటాను.

"నాకు ఇప్పటికీ ఒక సంగతి అర్థం కాలేదు" అన్నాడు రఘు.

"ఏమిటో అది?" అడిగాను.

"నా సెల్‌నెంబరు, నా పేరు మీకెలా తెలిశాయని?"

"ఆరునెలల కిందట ఒక సాయంత్రం మీ అపార్టుమెంటుకు ప్రూడెన్షియల్ ఇన్సూరెన్స్ విషయంలో వచ్చాను. దానిమీద మీరు ఎటువంటి ఆసక్తి చూపించలేదు. ఆలోచించి తర్వాత చెబుతానన్నారు. అప్పుడే మీ వివరాలు మీరే ఇచ్చారు."

"గుర్తు రానే రావడంలేదు. మీరెలా ఉంటారు?"

"ఏం బావుండను."

"బావుండే వాళ్ళేఅలా అంటుంటారు."

"గుర్తు పెట్టుకునేంత అందంగా ఏమీ ఉండను."

"మీ మాటలు బట్టి అలా అనిపించడం లేదు. మిమ్మల్ని మళ్ళీ చూడాలంటే ఏం చేయాలి?"

"చూసి?"

"అవును... చూసి?. మీరింకా ఆ కంపెనీలోనే పనిచేస్తున్నారా? మీ కోసమయినా ఒక పాలసీ తీసుకుంటాను."

"అప్పుడయినా నన్నుచూడొచ్చనా? ఆశ. ఒకసారి నన్ను చూస్తే దడుసుకుంటారు."

"భయపడదామని ఉంది."

"ఇప్పుడందులో పనిచేయడం లేదు. మానేసి అయిదు నెలలవుతోంది. ఏం చేయడంలేదు. ఇంట్లోనే ఉంటున్నాను. నేను మీ ఇంటికి వచ్చినప్పుడు ఒక విషయం గమనించాను."

"ఏమిటది?"

"మీఇంట్లో మీరొక్కళ్ళే కనిపించారు. ఆడవాళ్ళు ఉన్నట్లు అనిపించలేదు. మీకు పెళ్ళికాలేదా?"

"పెళ్లయింది. ఇద్దరు పిల్లలున్నారు. వరంగల్‌లో చదువుకుంటున్నారు. నా భార్యవరంగల్ లోనే లెక్చరర్‌గా పనిచేస్తోంది".

అప్పటికప్పుడు నేసిన అబద్ధంలా అనిపించింది.

"వారానికి ఒకసారయినా వరంగల్ వెళ్లొస్తుంటారా?"

"వారానికి ఒకసారి కాదు కాని, రెండుమూడు వారాలకు ఒక సారి వెళ్ళొస్తుంటాను. అప్పుడప్పుడు నా భార్యాపిల్లలు ఇక్కడ కొచ్చి నాలుగయిదు రోజులపాటు నాతో ఉండి వెళ్ళిపోతుంటారు."

అబద్ధాలు చెప్పడంలో రఘు నన్ను మించిన వాడిలా అనిపిస్తోంది. ఈ ఆరునెలల్లో అతని భార్య కాని, పిల్లలు కాని ఆ ఇంటికి రావడం, అతను ఊరు విడిచి వెళ్ళటం నేను చూడలేదు. ఈ విషయంలో చిన్నారావే నయం. తనకు అయిష్టమయినా నిజమే చెప్పేవాడు. నాకంటే పెద్దవాడయినా చిన్నపిల్లాడు తల్లికి చెప్పినట్టు మనసులో ఏం దాచుకోకుండా ఎప్పటి విషయాలు అప్పుడు చెప్పేస్తూ ఉండేవాడు. అతనంత నిజాయితీగా నేనెందుకు ఉండలేకపోయాను?

అంతకుముందు మాటల్లో తనకొక మార్బుల్ స్టోన్ షాపు ఉందన్నాడు రఘు. ఆమాట కూడా నిజం కాదేమోనని ఇప్పుడనిపిస్తోంది. చాలాసార్లు ఇంటికి ఆలస్యంగా

చేరుకుంటాడు. తాగి వస్తుంటాడేమో తెలియదు. వచ్చీరాగానే షూ విప్పుకోడు. దుస్తులు మార్చుకోడు. మంచానికి అడ్డంగా పడుకుని కుళ్ళి కుళ్లి ఏడుస్తుంటాడు. అతని మీద జాలివేస్తుంది. అతని బాధకు కారణం ఏమిటో తెలుసుకోవాలనిపిస్తుంది. అతని దగ్గరకు వెళ్ళి అతని తలను నా ఒడిలోకి తీసుకుని తల నిమురుతూ ఓదార్చాలని పిస్తుంది. అటువంటి సమయాల్లో చూస్తూ ఉండిపోతాను. ఫోను చేయాలనిపించదు. అతనికి దగ్గరవుతున్నా ఇప్పుడిప్పుడే నన్ను నేను బయట పెట్టుకోవడానికి జంకుతున్నాను. అతని గురించి తెలుసుకోవలసింది చాలా ఉందనిపిస్తోంది. ఇంకో ఎదురు దెబ్బ తగలడం నాకు ఇష్టంలేదు.

ఇప్పుడిప్పుడు నాతో మాట్లాడుతూ, హఠాత్తుగా, "ఫోను పెట్టేస్తున్నాను. ఏమనుకోకండి. పావుగంటాగి నేనే మీకు ఫోను చేస్తాను. మీరు చేయొద్దు" అని నాజవాబుకయి ఎదురు చూడకుండా సెల్ కట్టేసి మంచం మీద పెట్టి చివరంటా కాలిన సిగరెట్టుతో మరో సిగరెట్ వెలిగించుకుంటూ పక్కగదిలోకి వెళ్ళాడు. ప్రవేశద్వారం అటువయిపే ఉంది. ఎవరో వచ్చినట్టున్నారు. అవతలి గది నాకు కనబడదు.

ఒకటీ నలభయి అయింది. నాకునిద్ర వస్తోంది. అన్నయ్య ఇంటికి ఇంకాతిరిగి రాలేదు. ఆ రాత్రికి రఘుతో మాట్లాడవలసిన సంగతులు అయిపోయాయి. మనసు ఖాళీఅయింది. కూర్చున్నచోటనుండి లేవబుద్ధి కావడం లేదు. అంత రాత్రప్పుడు ఎవరు వచ్చి ఉంటారో తెలుసుకోవాలనిపిస్తోంది. ఒకవేళ వచ్చింది స్త్రీ అయితే ఆమెను తప్పకుండా పడకగదిలోకి తీసుకువస్తాడు. పురుషుడి వ్యక్తిత్వానికి స్త్రీ కొలబద్ద. అతన్ని అంచనా వేయడానికి నాకు అవకాశం దొరుకుతుంది.

మరో పావుగంట చూసి విసుగుపుట్టి లేద్దామనుకునేంతలో, వచ్చినవాళ్ళు వెళ్ళిపోయినట్టుంది, రఘు పడకగదిలోకి తిరిగి వచ్చాడు. మనిషిలోని ఉత్సాహమంతా ఆవిరయి పోయినట్టుగా ముఖంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. జరగకూడనిది ఏదో జరిగినట్లుగా ఉంది. గుండెకు నిప్పు అంటుకుని పొగలు రాకుండా కాలుతున్న మనిషిలా ఉన్నాడు. ఏమయి ఉంటుందో? అతని కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. అసహనం భరించలేక అతని సెల్‌కు రీడయల్ చేస్తోంటే నా చేతులు వణకటం గమనించాను. మంచం మీదున్న సెల్ అందుకున్నాడు నా నెంబరుచూసి. సెల్‌ను

వెంటనే స్విచ్ ఆఫ్ చేసి చిప్ బయటకుతీసి కిటికీలోంచి బయటకు విసిరి సెల్ మంచం మీద పడేశాడు. నా మనసును మంచులో ముంచినట్టు అయింది. లేచి నుంచున్నాను. నాగుండె వేగంగా కొట్టుకుంటోంది. ఇహ అతనితో మాట్లాడే అవకాశం నాకు రాదు. అతని కొత్త నెంబరు నాకు దొరుకుతుందని నమ్మకం లేదు. మధ్యలో నేనేం చేశాను? ఎందుకలా చేశాడు? ఇవతలి వయిపు గదిలోకి వెళ్ళాడు. ఆ గది కిటికీ మూసేసిఉంది.

పది నిమిషాలు గడిచిన తర్వాత లేత పసుపుపచ్చరంగు చీరలో ఉన్న ఒకామె కిటికీలోంచి తల బయటకు పెట్టి, అటూ ఇటూ చూసి, కిటికీ తలుపులు మూసేస్తోంటే గమనించాను. అచ్చం అటువంటి చీర నాకూ ఉంది. ఆమె మెడలో ఉన్న ముత్యాలదండ నా దగ్గరా ఉంది. పెద్ద కిటికీ తలుపులు తెరిచినప్పుడు ఆమెను స్పష్టంగా చూశాను. ఆమెకు నా అంత వయసే ఉండొచ్చు. నాలా ఉన్నట్లనిపిస్తోంది. ఆమె వెనక ఉన్న సీలింగు ఫేనుకు రఘు శరీరం వేలాడుతోంది. కిటికీ తలుపు మెల్లగా మూసుకుపోయింది. గదిలో లయిటు ఆరిపోయింది. బాధ, దుఃఖం ఏ భావం లేకుండా ఘనీభవించిన సాన్నిహితరాహిత్యరూపం నిజంగా నేనా?, లేక ఉరి భ్రమా? భ్రమ ఏకాకి.

❖ **తేజ వీక్లీ, 15 మే 2009**